
ప్రజాశక్తి

సోమవారం 12 ఆగస్టు 2024

5

పార్వతీపురం మన్యం



అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొండుకుప్ప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఉడుమల రామకృష్ణ (46) అనారోగ్యంతో శనివారం రాత్రి గుమ్మలక్ష్మీపురంలో తన ఇంటి వద్ద మృతి చెందారు. సౌమ్యుడు, స్నేహశీలి అయిన రామకృష్ణ అకాల మరణం చెందడం బాధాకరమని సర్పంచి బొత్తాడ గౌరీశంకర రావు, తోటి ఉపాధ్యాయులు అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే రామకృష్ణ ఇలా అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని ఎంఇఒ చంద్రశేఖర్ సంతాపం తెలిపారు.



మృతుడు రామకృష్ణ (ఫైల్)

అద్దె కట్టించుకుంటారా? చర్యలు తీసుకుంటారా?

ప్రజాశక్తి - సాలూరు



- షాపు నెంబర్ 20 ఎపిసోడ్‌లో పెద్దల హస్తం
- చర్యలకు తటపటాయిస్తున్న కమిషనర్
- విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసే యోచనలో కౌన్సిలర్లు

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా వున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నెంబర్ 20 అద్దె గోల్ మాల్ వ్యవహారం చిలికి చిలికి గాలివానలా మారుతోంది. సుమారు ఆరు నెలల క్రితం వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారాన్ని ఎంత తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నా అంత పెద్ద దుమారం రేపుతోంది. 2017 నుంచి షాపు నెంబర్ 20ను వాడుకుంటున్న యజమాని నుంచి గత పాలకవర్గం వసూలు చేసినట్లు దాఖలాల్లేవు. మూడేళ్ళ క్రితం పగ్గాలు చేపట్టిన వైసిపి పాలకవర్గం హయాంలో ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ ఖజానాకు దక్కాల్సిన అద్దె డబ్బులు వ్యక్తుల జేబుల్లోకి వెళ్లడం తీవ్రమైన నేరంగా పరిగణించాల్సి వుంది. మూడేళ్ల వరకు టిడిపి పాలకవర్గం హయాంలోనే ఈ షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారానికి బీజం పడింది. దీన్ని ప్రస్తుత పాలకవర్గం కూడా కొనసాగించింది. ఇప్పుడున్న పాలకవర్గంలో చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైసిపి కౌన్సిలర్ల మధ్య విభేధాల వల్ల ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇరువర్గాల మధ్య గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరడంతో షాపు నెంబర్ 20 ఎపిసోడ్‌లో మున్సిపల్ పెద్ద మనుషుల హస్తం వున్నట్లు రుజువైంది. గత పాలకవర్గం అనుసరించిన వైఖరినే ప్రస్తుత పాలకవర్గం అనుసరించి చిక్కుల్లో పడింది. పాలకవర్గం బాధ్యులు రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు కాబట్టి ఈ వ్యవహారంలో నేరుగా వారి ప్రమేయం కనిపించదు. కానీ మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారులు, కమిషనర్ ప్రేక్షక పాత్ర పోషించిన తీరు అనుమానాలకు తావిస్తోంది. 2017 నుంచి షాపు నెంబర్ 20ను వినియోగిస్తున్న యజమాని నుంచి గడిచిన మూడేళ్లకు సంబంధించిన అద్దె డబ్బులైనా అధికారులు వసూలు చేయాల్సి ఉంది. అయితే పాలకవర్గ పెద్దల ఒత్తిడి మేరకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏడేళ్లుగా షాపును వాడుకుంటున్న యజమాని నుంచి అపరాధ రుసుం తో కలిపి అధికారులు అద్దె డబ్బులు వసూలు చేయొచ్చు. కానీ ఇప్పటికైనా తప్పుని సరిదిద్దుకునే చర్యలు అధికారులు చేపట్టడం లేదు. పాలకవర్గం పెద్ద కూడా వివాదాస్పదమైన ఈ ఎపిసోడ్‌ను సుఖాంతం చేసే ప్రయత్నం చేయడం లేదు. ఈ వ్యవహారంలో పాలకవర్గ సభ్యుల మధ్య గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరడంతో వైసిపి ప్రతిష్ట మరింత దిగజారింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ పెద్ద మొండిగా వ్యవహరించడంతో మిగిలిన కౌన్సిలర్లు మరింత రచ్చకెక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ వ్యవహరిం చిన తీరుపై టిడిపి, వైసిపి కౌన్సిలర్లంతా భగ్గుమన్నారు. షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారంలో అధికారులను ఇరుకున పెట్టేలా ఆమె మాట్లాడిన తీరు ఈ అంశాన్ని మరింత రచ్చకెక్కించినట్టు కనిపిస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారి పద్మావతి ఈ షాపు అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ జరిపారు. షాపు నెంబర్ 20 ఖాళీగా వుందని, అద్దెకు ఇచ్చినట్లు ఆధారాల్లేవని విచారణ నివేదిక ఇవ్వడం వెనుక మున్సిపల్ పెద్ద ఒత్తిడి వున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మున్సిపల్ ఖజానాకు దక్కాల్సిన రూ.11.5 లక్షలు అద్దె డబ్బులు పక్కదారి పట్టించిన అధికారులు ఈ వ్యవహారంలో దోషులే అవుతారు.

విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసే యోచనలో కౌన్సిలర్లు

ఈ వ్యవహారంలో అసలు దొంగలెవరనేది తేల్చడానికి విజిలెన్స్‌కి ఫిర్యాదు చేయాలనే యోచనలో మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే అధికారులు బలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పాలకవర్గ బాధ్యులు చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యులవుతారనేది స్పష్టంగా కనబడుతోంది.

శరవేగంగా విమానాశ్రయం పనులు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దీన్నిబట్టి ఆరు నెలల ముందే పూర్తయ్యే అవకాశం ఉందనికేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాష్ట్ర మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి ఆయన ఆదివారం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులు, జిఎంఆర్, ఎల్ అండ్ టి ప్రతినిధులతో విమానాశ్రయ నిర్మాణంపై సమీక్షించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం 2026 డిసెంబర్ నాటికి ఎయిర్‌పోర్టు పూర్తి కావాల్సి ఉందని, కానీ ప్రస్తుత పనుల తీరును బట్టి ఆరు నెలల ముందుగా 2026 జూన్ నాటికే విమానాశ్రయం సిద్ధమవుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని, ఈ ప్రాంత వాసిగా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నానని వెల్లడించారు.

గత నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించేనాటికి 31.8శాతం పనులు జరిగాయని, ప్రస్తుతం 36.6శాతం పూర్తయిందని తెలిపారు. జూలై 11 నాటికి మట్టి పనులు 97.3శాతం పూర్తికాగా,



విమానాశ్రయం పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు

ప్రస్తుతం 98శాతం పూర్తయ్యాయన్నారు. గత నెలతో పోలిస్తే రన్ వే నిర్మాణ పనులు 32 శాతం నుంచి 38.67 శాతానికి, టాక్సీ వే పనులు 16.7శాతం నుంచి 20.78 శాతానికి, టెర్మినల్ నిర్మాణ పనులు 22.5శాతం నుంచి 27.28శాతానికి పూర్తయ్యాయని తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు నిర్వహిస్తున్న జిఎంఆర్, ఎల్అండ్‌టి కంపెనీలను మంత్రి అభినందించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చాలా చోట్ల విమానాశ్రయాలను నిర్మించాల్సి ఉందని, అవసరమైన భూమి, సాంకేతిక అంశాలు అనుకూలిస్తే వీటిని చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని, కావాల్సిన భూములను అప్పగించలేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ పనులను వేగవంతం చేశామని, సుమారు 52.5ఎకరాల భూమిని, ఇతర అనుమతులు కూడా మంజూరు చేస్తున్నామని అన్నారు. భోగాపురం విమానాశ్రయానికి విశాఖ వైపు నుంచే ఎక్కువగా ప్రయాణికులు వచ్చే అవకాశం ఉందని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారిపై 12చోట్ల మార్పులు చేయాల్సి ఉందని చెప్పారు. బీచ్ రోడ్ అభివృద్ధి కూడా ఒక ప్రత్యామ్నాయంగా యోచిస్తున్నట్లు వెల్లడించారు. విజయనగరం జిల్లా ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు, జొన్నాడ టోల్ గేట్‌ను తరలించే విషయంపై, సంబంధిత అధికారులతో మాట్లాడతామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఆర్‌డిఒ ఎంవి సూర్య కళ, తదితరులు పాల్గొన్నారు.



బస్సును నడుపుతున్న మంత్రి సంధ్యారాణి

ఆర్‌టిసి బస్సును ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

సాలూరు - విశాఖపట్నం రూట్ లో కొత్త ఆర్టీసీ బస్సును రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి డ్రైవర్ సీట్లో కూర్చొని బస్సును స్టార్ట్ చేసి ఉత్తేజాన్ని కల్పించారు. బస్సులో మొదటి టిక్కెట్‌ను మంత్రి కొనుగోలు చేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. అంతకుముందు వడ్డీవీధిలో రామమందిరం ప్రారంభోత్సవంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. చిన్నారులు, మహిళలతో కోలాటం ఆడి సందడి చేశారు. రామమందిరం ప్రాంగణంలో వృక్ష స్వరూపం ప్రతిష్ఠించి, జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి ప్రారంభించారు. ఆలయ అర్చకులు, స్థానిక కౌన్సిలర్, ప్రజలు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి డివివి ప్రసాదరావు,ఇఒ టి.రమేష్, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మంత్రి హాజరు

పార్వతీపురంరూరల్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుంది. ఫిర్యాదు దారుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరిస్తారు. అయితే ఈ వారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి కూడా పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

జలంరాని జలజీవన్ మిషన్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రతి ఇంటికీ తాగునీరందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్‌మిషన్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. అయితే మండలంలోని ఉల్లిభద్రకు మాత్రం ఈపథకం అందని ద్రాక్షగానే మారింది. ఈ గ్రామంలో రూ.12 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో గ్రామస్తులకు తాగునీటి అవస్థలు తప్పడంలేదు. ప్రధానంగా దళితకాలనీ వాసులు తాగునీటికి తీవ్ర అవస్థలుపడుతున్నారు. కుళాయి నీరు రాకపోవడంతో నేలబావి నీరే వీరికి దిక్కయింది. ఈ కుళాయిల నిర్వహణ విషయంపై అధికారులకు అనేకసార్లు అడిగినప్పటికీ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. దళిత వీధుల్లో ఏర్పాటు చేసిన కుళాయిలు ఉత్సవ విగ్రహాలు మాదిరిగానే ఉన్నాయి తప్ప నీరు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది

గ్రామంలో కొన్ని నెలల క్రితం జలజీవన్ మిషన్ పనులు చేపట్టినప్పటికీ కుళాయిలకు నీరు సరఫరా చేయక పోవడంతో గ్రామంలోని పలు విధుల్లో ప్రజలు తాగు నీరు రాక ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా ఉంది ఈ కొళాయి నిర్వహణ తీరు.

బోనెల సురేష్ ,
రెండో వార్డు సభ్యులు.

నీరులేక ఇబ్బందులు

ఒకప్పుడు వీధి కుళాయిల ద్వారా ప్రతి రోజు నీళ్ల వచ్చేవి. ఇటీవల కాలంలో కొన్ని రోజులు నుండి సరిగా నీటిని విడుదల చేయడం లేదు. దీనివల్ల నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. నూతి నీళ్లే మంచినీళ్లుగా వాడుకుంటున్నాం.

బి.కన్నమ్మ,
ఉల్లిభద్ర

నచ్చిన ఇళ్లకే కనెక్షన్...

గ్రామంలో ప్రతి ఇంటికీ తాగు నీరని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే పంచాయతీ పెద్దలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నచ్చిన ఇళ్లకే కనెక్షన్ ఇవ్వడం బాధాకరమైన విషయం. ఉన్నతాధికారులు నిధులు వినియోగం, నాణ్యతపై విచారణ చేయాలి.

బివి రమణ,
సిపిఎం నాయకులు.

తాగునీటికి ఉల్లిభద్ర వాసులు అవస్థలు



ఉల్లిభద్రలో నిరుపయోగంగా ఉన్న మంచినీటి కుళాయిలు

ప్రతిపాదనలు పంపాం..

జలజీవన్ మిషన్‌కు సంబంధించి 2020-21లో మంజూరైన నిధులతో మొదటి విడత పనులు చేపట్టినప్పటికీ అప్పుడు జిఎస్‌టి 12 శాతం ఉండేది. ఇప్పుడు 18 శాతానికి పెంచడం వల్ల మంజూరైనా నిధులు సరిపోక కొంత మేర పని జరిపించాం. మిగిలిన పని పూర్తి చేసేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే కొత్త ట్యాంక్ ఏర్పాటు చేసి, తాగునీరందించేందుకు చర్యలు చేపడతాం.

గౌరీ శంకర్ ,
ఆర్ డబ్ల్యు ఎస్ మండల అధికారి.

జిల్లాలో పౌష్టికాహార ఉద్యమం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆరోగ్యకరమైన సమాజమే దేశ ప్రగతికి మూలమని, అందుకు పౌష్టిక ఆహారం ఎంతో అవసరమని తలచి చిన్నపిల్లలు, బాలింతలు, బాలికల్లో రక్తహీనత నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ప్రజలకు అన్ని పోషకాలతో కూడిన పౌష్టికాహారపు అలవాట్లు పెంచేందుకు గానూ వారికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో బడి తోటలు, ప్రజలు వ్యక్తిగతంగా పెరటితోటలు సాగును ప్రోత్సహిస్తున్నారు. అందుకుగాను విస్తృత ప్రచారం చేస్తూ పాఠశాలల్లోనూ , అంగన్వాడీ కేంద్రాల్లోనూ, ఇళ్ల వద్ద వ్యక్తిగత అవసరాలకు కావాల్సిన ఆకుకూరలు, కాయగూరలు సేంద్రీయ పద్ధతిలో సాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అవసరం మేరకు విత్తనాల కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే విద్యాశాఖ, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జారీ చేశారు. వైద్య అధికారులకు కూడా పౌష్టిక ఆహారం విలువలపై ప్రజల్లో అవగాహన కలిగించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా విద్యార్థుల బోధనా ప్రమాణాలపెంపుతో పాటు, ఆహార అలవాట్లలో మార్పులు తీసుకొచ్చి వారికి అందించే ఆహారంలో సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆకు, కాయగూరలు, పండ్లు అందించేందుకు వీలుగా బడి తోటలు ప్రోత్సహి స్తున్నారు. ప్రతి పాఠశాలలో క్యారెట్, బీట్ రూట్, చిక్కుడు వంటి పోషకాహారాలను పండించి మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించా లని కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన నాయకులు, ఉపాధ్యాయులు జెండా ఎగురవేశారు. గడచిన కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం చేసిన పోరాటాలు, భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. అనంతరం పట్టణంలోని నవజీవన్ అనాధాశ్రమంలో ఉన్న పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.జానకీరావు, ఎ.రమేష్, రాజమణి, ఎస్.సింహాచలం, ఎ.సీతయ్య, ఎ.గణేష్, మన్మధ రావు, ఎ.గణపతి పాల్గొన్నారు.



యుటిఎఫ్ జెండాను ఎగురవేస్తున్న ఉపాధ్యాయులు

వట్టిగెడ్డ నీరు విడుదల

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన వట్టిగెడ్డ ప్రాజెక్ట్ నీటిని ఆదివారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా 13,324 ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా 3360 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా, ప్రస్తుతం డ్యామ్‌లో సంపూర్ణంగా నీరు చేరకపోవడంతో (పూర్తిస్థాయి నీటిమట్టం 399 అడుగులకు గానూ ప్రస్తుతం 382 అడుగులు నీరు మాత్రమే ఉంది) కుడి కాలువ నుంచి 80 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి 25 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేశారు. ప్రస్తుతం విడుదల చేసిన ప్రధాన కాలువగుండా వస్తున్న నీటితో తుంబలి, అల్లువాడ, జోగులమ్మ, బి.జె.పురం తదితర గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఉభాలు జరుగుతాయని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. ప్రతి ఏటా సెప్టెంబరు, అక్టోబర్ నాటికి డ్యాం పూర్తి సామర్ధ్యంతో నీరు ఉంటుందని, రైతులు ఆ సమయంలో వరి చేనులకు ఎలాంటి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ డిఇ ఉదయ భాస్కర్, ఎఇలు జివి రఘు, వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, రెడ్డి బలరాం స్వామి, చంద్రమౌళి, రంజిత్ కుమార్, గురాన శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వట్టిగెడ్డ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


బిఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం

గ్రామీణ ప్రాంతాల్లో 4జి సేవలు అందించేందుకు చర్యలు • 'ప్రజాశక్తి'తో బిఎస్ఎన్ఎల్ డిజిఎం దాలినాయుడు

ఉమ్మడి జిల్లాలో ప్రజలు, వినియోగదారుల సహకారంతో బి ఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు తెలిపారు. ప్రభుత్వ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందని అన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్





- **ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ సేవలు పొందుతున్న వారు ఎంతమంది?**

ఉమ్మడి జిల్లాలో ల్యాండ్ కనెక్షన్లు 1500, ప్రీపెయిడ్ కలెక్షన్లు 3 లక్షలు, ఫైబర్ కలెక్షన్లు 3500 ఉన్నాయి.

- **ఉమ్మడి జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సేవలు ఎలా ఉన్నాయి?**

బిఎస్ఎన్ఎల్ ద్వారా సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాలో 270 టవర్లు ఉన్నాయి. నిర్మాణంలో మరికొన్ని టవర్లు ఉన్నాయి. అవన్నీ సెప్టెంబర్ నెలలో అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 16 ఎక్స్చేంజీల ద్వారా సేవలు అందిస్తున్నాం.

- **ప్రైవేటు కంపెనీలకు దీటుగా మెరుగైన సేవలు అందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.**

- ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకు ధీటుగా బిఎస్ఎన్ఎల్ సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న 270 సెల్ టవర్ల కంటే మారుమూల గ్రామాలకు సైతం విస్తరించేందుకు మరో 57 టవర్ల నిర్మాణం చేపడుతున్నాం. సెప్టెంబర్ నెలాఖరు నాటికిఇ వినియోగంలోకి తీసుకు వస్తాం. ప్రతి గ్రామంలోను సెల్ ఫోన్ సిగ్నల్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- **ప్రైవేటు నెట్ వర్క్ సంస్థలు రీ ఛార్జి ధరలు విపరీతంగా పెంచిన నేపథ్యంలో దీని ప్రభావం బిఎస్ఎన్ఎల్‌పై ఎలా ఉంది?**

జియో, ఎయిర్‌టెల్, ఐడియా వంటి సంస్థలు రీఛార్జి ధరలు విపరీతంగా పెంచడం వల్ల బిఎస్ఎన్ఎల్ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే సుమారుగా 8వేల మంది వరకు నెట్ వర్క్ మారిన వారు, కొత్త సిమ్‌లు తీసుకున్న వారు ఉన్నారు.

- **ఉమ్మడి జిల్లాలో 4 జి సేవలు విస్తరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?**

దేశ వ్యాప్తంగా 4జి సేవలు విస్తరించేందుకు బిఎస్ఎన్ఎల్ సంస్థ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మన జిల్లాల్లో చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు పాత బ్యాటరీలతో నడుస్తున్న వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని టవర్లనూ 4జి సేవలు అందించే విధంగా దేశీయ టెక్నాలిజితో తయారు చేస్తున్నాం. విజయనగరం జిల్లా కేంద్రంలో 56 టవర్లు 4 జి సేవలు అందిస్తున్నాయి. వాటిని కోర్ ఎక్యూప్‌మెంట్ అనుసంధానం చేస్తున్నాం.

- **4జి సేవలు పొందాలంటే ఎటువంటి మార్పులు చెయ్యాలి? రుసుం ఏమైనా చెల్లించాలా?**

4జి సేవలు పొందాలంటే ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగానే 4జిలోకి మార్చుకోవచ్చు. 4 జి సేవలు అందుబాటులోకి రావడంతో ఇప్పటి వరకు 8వేలకు పైగా 4జిలోకి వినియోగదారులు మారారు.

- **ఏదైనా సమస్య చెబితే బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సకాలంలో రావడం లేదనే విమర్శ ఉంది. సరిపడా సిబ్బంది ఉన్నారా? సమస్యల పరిష్కారం కోసం తీసుకునే చర్యలు ఏమిటి?**

బిఎస్ఎన్ఎల్‌లో ఎక్కువ మంది ఉద్యోగులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఉద్యోగుల సంఖ్య తగ్గడం వాస్తవం. అయితే అదే క్రమంలో ప్రజలకు సేవలు అందించే విషయంలో,సమస్యలు పరిష్కారం చేసే విషయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సిద్ధంగా, అందుబాటులో ఉన్నారు. ఏ సమస్యపై ఫిర్యాదు వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నాం.

- **వినియోగదారులకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

వినియోగదారుల సహకారంతో బిఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. మా సేవలు పొందడం ద్వారా అధిక రీఛార్జిల వడ్డన ఉండదు. మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. ప్రజలకు మెరుగైన మొబైల్, ఇంటర్నెట్, ఫైబర్, ల్యాండ్ లైన్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.


నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థినిలు

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు, పాత విద్యార్థులు ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త విద్యార్థుల్లో భయం పోగొట్టడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చేరుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం కోడూరు లక్ష్మి, అకడమిక్ డైరెక్టర్ జి.మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ బదిలీ నిలిపివేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల పార్వతీపురం ఐటిడిఎ పిఒగా సేతు మాధవన్ (ఐఎఎస్) విధులు చేపట్టి కొద్ది రోజులకే బదిలీ చేయడం అన్యాయమని, వెంటనే బదిలీని నిలిపివేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే సమయంలో ఇలా బదిలీ చేయడం అనేది చాలా బాధాకరమన్నారు. ఈ బదిలీని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించి నిలిపివేయాలని కోరారు. లేకుంటే కొత్తగా వచ్చే పిఒ యువ ఐఎఎస్ అధికారితో మాత్రమే భర్తీ చేయాలని కోరారు.


క్రీడా మైదానాన్ని బాగు చేయిస్తున్న ఎస్ఎంసి చైర్మన్ రాజేష్

విద్యార్థులకు అందుబాటులో క్రీడా మైదానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా ఆదివారం తన సొంత నిధులతో క్రీడా మైదాన పనులను కొత్తగా ఎన్నికైన ఎస్ఎంసి చైర్మన్ సొంటేన రాజేష్ దగ్గరుండి చేయించారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ముందుగా నిర్వహించే ఆటల పోటీలకు క్రీడాస్థలం అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. దశాల వారీగా పాఠశాల సమస్యలను పరిష్కరించి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శాంతికుమారి

స్కూల్ స్వీపర్ల కొత్త కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

పాఠశాలల పారిశుధ్య కార్మికుల సంఘం మండల నూతన కార్యవర్గం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై శాంతి కుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీతానగరంలో జరిగిన సమావేశంలో తొలుత ఆమె మాట్లాడుతూ పాఠశాలల పారిశుధ్య కార్మికులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని, యూనిఫాం, సబ్బులు, గ్లౌజులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 8మందితో మండల కొత్త కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా పెంకి ఉష, కార్యదర్శిగా రాయిపల్లి నందినితో పాటు మరో ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పనులు వేగవంతమయ్యేలా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో ఘట్టాలడెప్పి వీధి, సెగిడి వీధి దగ్గర నుంచి గారమ్మ కాలనీ, వీరఘట్టం వైపునకు కలుపుకుని వెళ్లే వంతెన పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని నగర పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులను టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్‌కుమార్ సూచించారు. ఆదివారం పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. ఈ వంతెన ఎన్నో వీధులకు మార్గమని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నాలుగో వార్డ్ కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు, తదితరులు ఉన్నారు

కొండలరావును కలిసిన ఇయు నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ మాజీ చైర్-పర్సన్ ప్రతినిధి పల్లా కొండలరావును ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డిపోలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆయనతో పాటు డిపో అధ్యక్షులు బొడ్డేపల్లి శ్రీనివాస్, రవి సాగర్, శ్రీనివాస్, సందీప్, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. అలాగే జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రిఫరల్ నిలిపివేయాలని, వైద్యశాఖలో ఖాళీ పోస్టులను భర్తీచ చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం కొమరాడలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విష జ్వరాలు ఎక్కువ కావడంతో ఆసుపత్రుల్లో రోగుల తాకిడి పెరిగిందన్నారు. ఆసుపత్రుల్లో సరిపడా బెడ్లు లేకపోవడంతో రోగులకు అరకొర వైద్యం అందుతుందన్నారు. కావున అధికారులు స్పందించి ప్రతిగ్రామంలోనూ వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలు వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు హెచ్.లక్ష్మయ్య, రెడ్డి శివున్నాయుడు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని మరికి పంచాయతీ, కొత్త ఊరు గ్రామానికి చెందిన మెల్లిక గణేష్ అనే గిరిజన యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ఉర్లక నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్త ఊరు గ్రామానికి వెళ్లి గిరిజన యువకుడ్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన యువకుడ్ని అకారణంగా కులం పేరుతో దూషించి, పిడిగుద్దులు గుద్ది తీవ్రంగా కొట్టారని తెలిపారు. ఇప్పటికీ తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న గిరిజన యువకుడు మెరుగైన వైద్యం కోసం విశాఖ వెళ్లేందుకు సిద్ధ పడుతున్నాడని, జిల్లా ఆసుపత్రి వైద్యులు ఏరకంగా డిశ్చార్జ్ ఇచ్చారో అర్థం కావడం లేదని తెలిపారు. దాడిచేసిన వారికి కఠిన శిక్ష పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బాధితుడు పార్వతీపురం ఐటిడిఎ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న గిరిజన యువకుడు కావున ఐటిడిఎ ద్వారా అన్ని రకాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాగునీటికి తిప్పలు

- తోటపల్లి సాగునీటి కోసం అన్నదాతలు ఎదురుచూపు
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మూడు దశాబ్దాల పైబడి తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నుండి డెప్పివలసకు సాగునీరు కలగా మిగిలిపోయింది. సాగునీరందక ఈ ప్రాంత ప్రజలు నిత్యం కరువు బారినపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు సాగునీరందిస్తామని హామీలకే పరిమితం తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రజాప్రతినిధుల తీరు ఉందని డెప్పివలస గ్రామ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆడారు పంచాయతీ డెప్పివలసలో సుమారు 150మంది రైతులు ఉన్నారు. వీరు తమ భూములకు సాగునీటి కోసం తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ హుస్సేన్ పురం వద్ద సెవెంత్ బ్రాంచ్ నుంచి తూడి మీదుగా తమ గ్రామానికి పిల్ల కాలువ ద్వారా సాగునీరు రావాల్సి ఉన్నప్పటికీ ఎగువ ప్రాంత రైతులు కిందకు నీరు రానీయకుండా చేశారు. దీంతో డెప్పివలస గ్రామ రైతులు సాగునీటి కోసం వరుణిడిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ గ్రామానికి సమీపాన గల కొండ వరద నీరు జన్నివాని చెరువులోకి చేరితే అక్కడి నుంచి ఎర్ర చెరువు, కమ్మనపోనిచెరువు, కోనేరు, కొండవాని చెరువులకు చేరడంతో ఆయకట్టు భూములకు సాగునీరందడంతో పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు.

ప్రకటనలకే పరిమితం

తూడి గ్రామ పిల్ల కాలువ నుంచి తమ గ్రామాలకు సాగునీరందించేందుకు గత ప్రభుత్వ పాలనలో సాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు వద్ద మొర పెట్టినప్పటికీ 197 మీటర్లలో కాలువ పనులు చేపడతామని 2019 -2020లో పాలకులు ప్రకటనలు చేశారు. అయితే నేటికీ ఆ పనులు కార్యరూపం దాల్చకపోవడంతో పాలకులు ప్రకటనకే పరిమితం తప్ప కాలువ కొలతల్లేవని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి పంటపై పెట్టుబడులు పెట్టినప్పటికీ అనుకున్న సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంట నష్టాలు చూసిన రోజులు చాలా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడంతో అప్పట్లో ఎంతో ఆశపడ్డ తమ ఆశలు ఆవిరి అయిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక వరుణిడిపైనే ఆశలు పెట్టుకొని సాగు చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సాగునీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని డెప్పివలస రైతులు కోరుతున్నారు.


సాగునీరు రాక పిచ్చిమొక్కలతో నిండిన కాలువ

వర్షాలపై ఆధారపడి సాగు

డెప్పివలసకు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో వర్షాలపైనే ఆధారపడి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నాం. మూడు దశాబ్దాల పైబడి వర్షాలపైన ఆధారపడి పంటలు సాగు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంట నష్టాలు సవిచూసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం.

ఎం సూర్యనారాయణ,, రైతు, డెప్పి వలస

హామీలకే పరిమితమైన ప్రజా ప్రతినిధులు

డెప్పివలసకు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులకు విన్నవించనప్పటికీ కాలువ ద్వారా నీరు వచ్చేందుకు ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చినప్పటికీ వాటిపై దృష్టి చారించకపోవడంతో సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఫలితంగా వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పి.నారాయణ,, రైతు, డెప్పి వలస.

నేటి నుంచి శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీ అభివృద్ధి విధి విధానాలపై సర్పంచులకు, కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంట వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండలంలో గల 23 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు సకాలంలో హాజరై శిక్షణను సద్వినం చేసుకోవాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : పంచాయితీల్లో పారిశుధ్య, శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జిపిడిపి స్క్రూటినీ, పంచాయతీల్లో ఎల్ఇడి లైట్లు నిర్వహణ తదితర అంశాలపై గ్రేడ్-1 నుంచి గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రమేష్ బాబు తెలిపారు. ఈ శిక్షణను ఈనెల 12 నుంచి 14 వరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఉంటుందని అన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని ఈ మేరకు మండలంలో ఉన్న 27 పంచాయతీలకు చెందిన కార్యదర్శులంతా శిక్షణను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇలా ఉంటే ప్రజారోగ్య పరిరక్షణ ఎలా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఇలా ఉంటే ప్రజారోగ్య పరిరక్షణ ఎలా ఉంటుందని సిపిఎం నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పదో వార్డులో గల గొడగలవీధి, స్వీపర్ వీధి, పెద మాదిగ వీధి, మొండిపండా వీధి, చిన మాదిగ వీధుల్లో వారు పర్యటిస్తూ ఆయా వీధుల్లో కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి నివాస గృహాల వాడుక నీరు మురుగునీటితో కలిసి నిల్వ ఉండి అధ్వానంగా ఉన్న పరిస్థితితో పాటు ఆ వార్డులో ఉన్న బోరింగు పరిసరాల్లో గల కాలువలో మురుగు నీరు నిల్వ ఉండడం చూసి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే జూలై నుంచి ఆగస్టు వరకు పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టిన సందర్భంలో కూడా పట్టణంలో పలు వార్డుల్లో కాలువలు ఈ పరిస్థితిలో ఉంటే, స్థానిక ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, సంబంధిత మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, వార్డ్ సచివాలయ శానిటరీ సెక్రటరీలు పర్యవేక్షించకపోవడమేమిటని వెంటనే అధికారులు ఆ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని అన్నారు.


మురుగు కాలువను చూపుతున్న సిపిఎం నాయకులు

కాలువలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో కాలువలు నిర్మించి పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ జరిగింది. సిపిఎం మండల నాయకులు కొర్ర కల్యాణ్, మంచాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రంలో సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కాలువల్లేక పారి శుధ్య సమస్యలు పెరిగి ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీటి కుళాయిల వద్ద కాలువల్లేక మురుగునీరు నిల్వ ఉండిపోతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పాచిపెంటలో కాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిలో రోడ్డు వేసిన వెంటనే కాలువలు నిర్మాణం చేపడతామని ఆనాడు చెప్పిన అధికారులు నేటికీ ఆ పని చేయలేదన్నారు. అలాగే పాచిపెంట మెయిన్ రహదారి ఊర్లో రోడ్డు మధ్యలో ఆపేశారని ఆ రోడ్డు కూడా పూర్తి చేయాలని కోరారు. వెంటనే కాలువ నిర్మాణం చేపట్టాలని లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు, కార్యకర్తలు భీమారావు, ఎర్రయ్య, కె.శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఘనంగా అమ్మ సేవాసమితి తృతీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో గత మూడేళ్లుగా రోగులకు నిరాటంకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అమ్మ సేవా సమితి తృతీయ వార్షికోత్సవం ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఘనంగా నిర్వహించారు. నీకున్నది తృప్తిగా తిని మిగిలింది ఇతరులకు ఆదరంగా పెట్టు అన్న జిల్లెళ్లమూడి అమ్మ ఆశయాల్ని నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని అధ్యక్ష, కార్యదర్శులు గంటేడ సోమేశ్వరరావు, గంటేడ చిన్నంనాయుడులు తెలిపారు. తృతీయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న హిందీ కళాశాల కరస్పాండెంట్, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్, పట్టణ ప్రముఖులు డాక్టరు మంచుపల్లి శ్రీరాములు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు, పురప్రముఖులు, సేవా తత్పరులు బి.నాగభూష ణరావు, ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు, యోగా గురువు బల్ల గంగునాయుడు తదితరులు అమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న అన్నసంతర్పణ కార్యక్రమాలను, సామాజిక సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. అమ్మ సేవా సమితి నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న ముఖ్యఅతిథిలకు, సంస్థకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తున్న ముఖ్యవ్యక్తులకు, సంస్థలో కీలకపాత్ర పోషిస్తున్న వారికి అమ్మా సేవాసమితి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయిన్స్ క్లబ్ అధ్యక్షులు బి.నాగభూషణరావు, జట్టు ఆశ్రమ నిర్వాహకులు డాక్టరు పద్మజ, ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు, అమ్మ సేవాసమితి అధ్యక్షులు గంటేడ సోమేశ్వరరావు, కార్యదర్శి గంటేడ చిన్నంనాయుడు, యోగా గురువు బల్ల గంగునాయుడు, పొట్నూరు చిన్నంనాయుడు గంగమ్మ, మూడడ్ల ఉమామహేశ్వరరావు, శ్రీరామమూర్తి, బులుసు భాస్కరరావు, కర్రి జనార్ధన్, దాసరి శ్రీరామ్మూర్తి, బొరోతు శంకరరావు, నల్ల అప్పలనాయుడు, గౌరు నాయుడు, సిహెచ్. త్రినాధరావు, శ్రీరామమూర్తి నాయుడు,పాల్గొన్నారు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

ఏటా విద్యార్థులకు గంటేడ చిన్నమ్మలు పురస్కారం అందచేత:

కొమరాడ మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కొమరాడ, దళాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో అత్యధికమార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు గంటేడ చిన్నమ్మలు స్మారక ఉత్తమ విద్యార్థి పురస్కారం పేరిట ఒక్కొక్కరికి రూ.2వేల నగదు, షీల్డ్, ప్రశంసాపత్రాలను విశ్రాంత తెలుగు పండిట్ గంటేడ సోమేశ్వరరావు అందజేశారు. గత ఐదేళ్ల నుంచి దీన్ని అందజేస్తున్నట్లు అమ్మ సేవాసమితి అధ్యక్షులు తెలిపారు. ఈ ఏడాదికి గానూ ఈఏడాదికి గాను ఈ నలుగురు విద్యార్థులకు అందజేశారు.


డోలీలో మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

శ్మశానానికి దారేది?

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిల్లాడ పంచాయతీ చింతమానుగూడ శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో అక్కడ గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన సవర సిరంగి అనారోగ్యం తో ఆదివారం మృతి చెందడంతో దహన సంస్కారాలకు శ్మశాన వాటికకు వెళ్లడానికి దారి లేక కొండ కోనల్లో ముళ్ల పొదల్లో నడిచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తమ గ్రామ శ్మశాన వాటికకు వెంటనే రహదారి మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.

పరిశీలనకే పరిమితమైన శిక్షణా కేంద్రాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రెండేళ్లుగా క్రీడా శిక్షణ కేంద్రాలు పరిశీలనకే పరిమితమయ్యాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో 2002లో రాష్ట్రంలో ఆరు క్రీడా శిక్షణ కేంద్రాలకు ఏర్పాటుకు పలు గురుకుల, ఆశ్రమ పాఠశాలలను అధికారులు పరిశీలన చేశారు. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో భద్రగిరి, సీతంపేటలో ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి ప్రణాళికలు పంపించారు. అయితే క్రీడా శిక్షణ కేంద్రాల ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు. క్రీడల్లో మంచి ప్రతిభ, నైపుణ్యాలు ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి స్థానిక పాఠశాలలోనే ప్రత్యేకంగా క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని అప్పటి పరిశీలనకు వచ్చిన క్రీడా ప్రాధికార సంస్థ సహాయ డైరెక్టర్ పి.దేవానందం తెలిపారు. ఈ మేరకు జిల్లాలో సీతంపేట క్రీడా శిక్షణా కేంద్రంలో (బాలురకు) అథ్లెటిక్స్, హాకీ, జూడో, బాస్కెట్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, భద్రగిరిలో (బాలికలకు) అథ్లెటిక్స్, జూడో, వెయిట్ లిఫ్టింగ్, హాకీ విభాగాల్లో శిక్ష వేస్తామని అధికారులు ప్రకటించారు. క్రీడా శిక్షణతో తమ సామర్థ్యాలను వెలికి తీయడానికి వీలుంటుందని విద్యార్థులు ఎంతో సంతోషపడ్డారు. ఆ ప్రక్రియ అమలు జరగకపోవడంతో విద్యార్థుల్లో తీవ్ర నిరాశ కనిపించింది. ఎవరైనా దాతలు ముందుకొచ్చి స్థలాలు ఇస్తే క్రీడా మైదానాలు నిర్మిస్తామని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలోనైనా క్రీడా శిక్షణ పాఠశాలలను ఏర్పాటుచేసి స్థానికంగా వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తే రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించగలిగే గిరిజన క్రీడాకారులు ఉన్నారని గిరిజన నాయకులు అంటున్నారు.

ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయాలి..

గుమ్మలక్ష్మీపురంలో మధ్యలో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులు పూర్తిచేసి క్రీడా శిక్షణ అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ కోరారు. గత టిడిపి హయంలోనే నిర్మించిన భవనం ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కనుక ఈ భవనంపై దృష్టి సారించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం

రోగులతో ఆస్పత్రి కిటకిట

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవైనప్పటికీ రోగుల తాకిడి పెరిగింది. ఇప్పటికే 40 రోగులు వచ్చారు. సీతంపేట ఏజెన్సీలో మర్రిపాడు, ధోనుబాయి, ఆడాలి, తాడిపాయి, హడ్డుబంగి తదితర ప్రాంతాల్లో వైరల్ మలేరియా రోగులు చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే వైద్యాధికారి మనోజ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందిస్తున్నారు. రోగులు అధికంగా ఉండడంతో బెడ్స్ చాలకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఉన్న మంచాలు పైన రోగులు చికిత్స పొందుతున్నారు. టిడిపి నాయకులు హెచ్.ప్రసాదరావు రోగులను పరామర్శించారు. ఆస్పత్రి అదనపు భవనం నిర్మాణ పనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో వంద పడకల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కుదమ పంచాయతీ గౌరీపురంలో విషాదం చోటుచేసుకుంది. తెల్లవారితే తన తమ్ముడు వివాహం జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆ అన్న శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కుదమ పంచాయతీ గౌరీపురం గ్రామానికి చెందిన అంకలాపు చంద్రశేఖర్(32) తన తండ్రి అప్పలస్వామి లేకపోవడం కుటుంబానికి పెద్ద దిక్కై, తమ్ముడు లక్ష్మణరావుకు పెళ్లి కుదిర్చాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో వివాహం జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆయన్ను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చంద్ర శేఖర్ మృతి చెందినట్లు నిర్ధారించిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. చినమేరంగి ఎస్సై ఇన్‌ఛార్జి ఎస్ఐ అమ్మన్నరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్‌కు తల్లి లక్ష్మి, తమ్ముడు లక్ష్మణరావు ఉన్నారు.


మృతుడు చంద్రశేఖర్ (ఫైల్)

చదవడం మాకిష్టం

గరుగుబిల్లి: స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చదువుతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఉయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా శ్రీకృష్ణదేవరాయుల జీవిత చరిత్రను విద్యార్థులకు చదివి వినిపిం చారు. క్రీడాపోటీల్లో భాగంగా చదరంగం, క్యారంబోర్డు తదితర ఆటల పోటీలను నిర్వహిం చామని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా సప్పగూడ

పక్కాఇళ్లు లేవు .. స్వచ్ఛమైన తాగునీరు లేదు..

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని సప్పగూడ గిరిజన గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. ఈ గ్రామం ఏర్పాటై 40 ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ జీవిస్తున్న గిరిజనులకు కనీస మౌలిక వసతుల్లేవు. గ్రామంలో 40 కుటుంబాలు ఉండగా 230మంది వరకు జనాభా కలిగి ఉన్నారు. వీరు తాగేందుకు స్వచ్ఛమైన నీరు లేక బావి, ఊట జలాలపై ఆధారపడుతున్నారు. పక్కా గృహాలు లేక శిథిలమైన రేకిళ్లలోనే తలదాచుకుంటున్నారు. ఈ గ్రామం కొండ శివారు ప్రాంతం కావడంతో బోర్లు నిర్మాణం జరగలేదు. దీంతో ఏడాది పొడవనా నీటి కష్టాలు తప్పడం లేదని గ్రామస్తుడు భీమారావు తెలిపారు. ప్రజల నిత్యావసరాలకు, మధ్యాహ్న భోజనం నిర్వహణకు బావినీటిపైన ఆధారపడుతున్నారు. ఐటిడిఎ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. గ్రామంపై ఐటిడిఎ అధికారుల దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


పక్కా ఇళ్లు, రోడ్డులేని సప్పగూడ